క్లుప్తంగా

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వ్యక్తిపై కేసు

ఉండి: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన టీడీపీ నాయకుడిపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం ఉండి కొత్తపేట సెంటర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఎన్నార్పీ అగ్రహారానికి చెందిన టీడీపీ నాయకుడు బురిడి రవిబాబు మార్చి 29న టీడీపీ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో ముసుగు తొలగించి పూలమాలలు వేసి చేసి నివాళులర్పించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో ఎంపీడీఓ ఎస్.రవీంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేశారు.

జగన్ నాయకత్వాన్ని బలపర్చాలి



పేరుపాలెం నార్త్ పంచాయతీలో ఓట్లు అభ్యర్థిస్తున్న ప్రసాదరాజు భార్య శారదా వాణి

మొగల్తూరు: రాష్ట్రంలో అన్ని వర్గాలకు పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలపర్చాలని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు భార్య శారదావాణి ఓటర్లను కోరారు. ఆదివారం మొగల్తూరు మండలంలోని పేరుపాలెం నార్త్ పంచాయతీలోని పలు ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె ఇంటింటికి తిరుగుతూ అభివృద్ధితో సంక్షేమాన్ని అందించిన ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కావలి రామసీత నాని, ఎంపీటీసీ సభ్యుడు డీవీవీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు అందే భుజంగరావు, కర్రి ఏసుబాబు, కవురు సాయి, వేగి బాబి, కోడెల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ గ్రామోత్సవం

యలమంచిలి: ఉగాది సందర్భంగా అడవిపాలెం గ్రామంలో నిర్వహించే గ్రామదేవత కనకదుర్గమ్మ అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆసాదులు అమ్మవారి వెండి ఘటాలను తలపై ఎత్తుకుని మంగళవాయిద్యాలతో గ్రామమంతా ఊరేగించారు. వెండి ఘటాలు ఎత్తుకుని అమ్మవారి రూపంలో తమ ఇళ్లకు వచ్చిన ఆసాదుల పాదాలను మహిళలు పసుపు నీళ్లతో కడిగి, కొబ్బరికాయలు, అరటిపళ్ల నైవేద్యం సమర్పించి కర్పూరంతో హారతులిచ్చారు. ఉగాది ముందు రోజు ఏప్రిల్ 8న గ్రామానికి పడమర వైపున జాతర ఏప్రిల్ 9న ఉగాది రోజు గ్రామానికి తూర్పు వైపు జాతర నిర్వహించి ఏప్రిల్ 10న ఊయల సేవతో అమ్మవారిని ఆలయ ప్రవేశం చేయడంతో ఉత్సవాలు ముగుస్తాయని మెట్టింనింటి వంశ పారంపర్య ధర్మకర్తలు బొలిశెట్టి రావులియ్య, పితాని శ్రీనివాసరావు తెలిపారు.

నేడు పెనుమంత్రలో శ్రీరంగనాథరాజు ఎన్నికల ప్రచారం

పెనుమంట్ర: పెనుమంట్ర గ్రామపంచాయతీ పరిధిలో సోమవారం నుంచి వైఎస్సార్ సీపీ ఎన్నికల శంఖారావం ప్రచార పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు గ్రామ కమిటీ అధ్యక్షుడు తేతలి సుధీర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే ఈ ప్రచార పాదయాత్రలో వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వలంటీర్లపై చంద్రబాబు కక్ష

పెనుమంట్ర: రాష్ట్రంలో ప్రజాదరణ కోల్పోయిన మాజీ సీఎం చంద్రబాబునాయుడు ఓటమి భయంతో రాష్ట్రంలో వలంటీర్లపై పగ సాధిస్తూ, వృద్ధుల పింఛన్‌దారులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి అన్నారు. ఆదివారం ఆమె మార్టేరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా ఇంటికే అందించడాన్ని జీర్ణించుకోలేని తెలుగుదేశం నాయకులు తప్పుడు ఆరోపణలతో ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదులు చేయడమే కాకుండా కోర్టులో కూడా తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. దీనివల్ల సంక్షేమ పథకాల అందుకుంటున్న వృద్ధులు ఈ నెల నుంచి అనేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి ఉందని, వారి శాపాలతో చంద్రబాబు రాజకీయ జీవితం పతనం కాక తప్పదని ఆమె పేర్కొన్నారు.

వలంటీర్ల సేవలను అడ్డుకోవడం అమానుషం

యలమంచిలి: ఎన్నికల కోడ్ పేరుతో తెలుగుదేశం నాయకులు వలంటీర్స్ సేవలను అడ్డుకోవడం అమానుషమని పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్ విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగుదేశం తరఫున ఫిర్యాదు చేయడం వల్లే ఎలక్షన్ కమిషన్ వలంటీర్స్ ఫించన్‌లు పంపిణీ చేయకూడదని ఆదేశాలు ఇచ్చిందని పేర్కొన్నారు. వలంటీర్ల విషయంలో తెలుగుదేశం నాయకులు రెండు నాలుకల ధోరణి అవలంబిస్తున్నారని స్టాలిన్ ఆరోపించారు. శ్రీకాళహస్తి ఇన్‌చార్జి బొజ్జల సుదీర్ వలంటీర్లను టెర్రరిస్టలతో పోల్చుతున్నారని మండిపడ్డారు.

ప్రభు ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలి

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, ఉమాబాల



భీమవరం లూథరన్ దేవాలయంలో విశ్వాసులకు ఈస్టర్ పండగ శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రభు ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఈస్టర్ పండగ సందర్భంగా ఆయన నర్సాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ గూడూరి ఉమాబాలతో కలిసి పట్టణంలోని పలు చర్చిల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముందుగా బేతనిపేట చర్చి, లూథరన్ చర్చి, తాడేరు పెద్ద చర్చి, కల్వరి చర్చి, రూపాంతర దేవాలయాలకు వెళ్లి విశ్వాసులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభు మళ్లీ ప్రజల కోసం తిరిగి వచ్చిన గొప్ప కార్యమని ఈస్టర్ పండగగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. గూడూరి ఉమాబాల మాట్లాడుతూ ఈస్టర్ పండగ నాడు ప్రభు సన్నిధిలో ఉండి ప్రభును ప్రార్థించుకునే భాగ్యం కలగడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తోట భోగయ్య, కోడె యుగంధర్, మద్దుల కరుణకుమార్, ఆయా చర్చిల పాస్టర్లు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు త్యాగానికి ప్రతిరూపం

ఉండి: మనుషుల పాపాలు తనపై వేసుకుని శిలువ మరణం పొంది తిరిగి లేచిన ఏసుక్రీస్తు త్యాగానికి ప్రతిరూపమని ఉండి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఈస్టరు పండుగను పురస్కరించుకుని ఆదివారం మండలంలోని ఉండి పెదపేట సెయింట్ పాల్స్ లూథరన్ చర్చ్,ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చిలతో పాటు పలు చర్చిల్లో పీవీఎల్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.పేరిష్ పాస్టర్లు రెవరెండ్ మానుకొండ ప్రసన్న,రెవరెండ్ వీ నెహ్రూ పీవీఎల్‌కు ప్రార్దనలు చేశారు. సందర్భంగా పీవీఎల్ క్రైస్తవులకు ఈస్టరు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ మంచి చేశారని, రానున్న ఎన్నికల్లో తనకు ఓటు వేయడం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు రణస్తుల కనకదుర్గ, ఉండి ఉప సర్పంచ్ గొట్టుముక్కల కల్యాణ్ వర్మ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యేడిద వెంకటేశ్వరరావు, రాష్ట్ర జానపద కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు,రణస్తుల మహంకాళి, గలావిల్లి ధనుంజ, కరిమెరక శివనాగరాజు, మునుకోలు సింహాచలం, ఉండి గ్రామపార్టీ అధ్యక్షుడు కరిమెరక మల్లికార్జున,చిట్టూరి రత్నరాజు, అంగర రాంబాబు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈస్టర్ పండుగ సందర్భంగా యండగండిలో నిర్వహించిన ప్రార్థనల్లో పేరిష్ పాస్టర్ రెవరెండ్ సుధీర్ మాట్లాడుతూ ఈస్టర్ విశిష్టతను తెలిపారు.

కాళ్లలో..

కాళ్ల: ఈస్టర్ వేడుకలను ఆదివారం మండలంలో అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున సమాధులతోటలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సెయింట్ పాల్ రూపాంతర లూథరన్ చర్చిలో సీఆర్, మన్నా చర్చిలో ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఆకివీడులో..

ఆకివీడు: సత్యం, శాంతి వర్ధిల్లే విధంగా ఏసుక్రీస్తు పునర్జన్మ పొందిన రోజుగా ఈస్టర్ పండుగను క్రైస్తవ సోదరులు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. స్థానికంగా పలు క్రైస్తవ సమాధుల్ని అలంకరించి శనివారం అర్ధరాత్రి విద్యుత్ దీపాలు, కొవ్వతుల వెలుగుల్లో సమాధల వద్ద పూజలు చేశారు. స్థానిక దొరగారి చెరువు వెనుక ఉన్న సీబీసీఎన్‌సీ చర్చి స్మశానవాటిక వద్ద విద్యుత్‌దీపలంకరణ, కొవ్వత్తుల అలంకరణ పలువుర్ని ఆకట్టుకుంది. ఆకివీడు మొట్టమొదటి సర్పంచ్ చూట్ దొర సమాధి వద్ద సీబీసీఎన్‌సీ సీఆర్‌జీ జోసఫ్ రాజు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక హోప్ బాప్టిస్టు చర్చి వద్ద సమాధులను అలంకరించి పూలతో పూజలు చేశారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: క్రీస్తు బోధనలు అనుసరణీయమని గరగపర్రు ప్యారిస్ పాస్టర్ రెవరెండ్ వై.జయరాజు ప్రబోధించారు. ఆదివారం ఈస్టర్ సందర్భంగా మోగల్లు, పాలకోడేరు కోరుకొల్లు, మైప,గొల్లలకోడేరు, వేండ్ర, శృంగవృక్షం, పెన్నాడ, గొరగనమూడి, విస్సాకోడేరు, కుముదవల్లి తదితర గ్రామాల్లోఉన్న లూథరన్, ఆర్‌సీఎం తదితర చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు ఆరాధన, గీతాలాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యారిస్ పాస్టర్ వై.జయరాజు ఈస్టర్ విశిష్టతను తెలిపారు. కార్యక్రమంలో చిల్లా విక్టర్ బాబు, ఇవాంజెలిస్ట్ గోపే సాల్మన్ రాజు, విశ్రాంత ఎస్సై బలే జోసెఫ్ రాజు, చిల్లా ప్రసాదరావు, ఎంపీటీసీ కాటూరి శాంతకుమారి, వార్డు మెంబర్లు సైదు శివలింగేశ్వర, బలే చిట్టిబాబు పాల్గొన్నారు.



ఉండి: సెయింట్‌పాల్స్ లూథరన్ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు



కాళ్ల: సమాధులపై కొవ్వొత్తులు వెలిగిస్తున్న చిన్నారులు



ఆకివీడు: దొరగారి చెరువు వెనుక శ్మశానవాటికలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ ప్రార్థనలు



సండే స్కూల్ విద్యార్థులకు బైబిల్స్ అందిస్తున్న దృశ్యం

భీమవరం: మండలంలోని క్రైస్తవ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొవ్వాడ అన్నవరం గ్రామం డాక్టర్ బీవీరాజు కాలనీలోని పరిశుద్ధ క్రీస్తు దేవాలయంలో ఈస్టర్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ట్రస్టీ డైరెక్టర్ ఆర్.ప్రసాదరాజు ఆధ్వర్యంలో 20 మంది సండే స్కూల్ పిల్లలకు బైబిల్స్ అందించారు. క్రీస్తు కొరకు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యు.జె కర్యా, రావి భారతి తదితరులు పాల్గొన్నారు.

భీమవరం అర్బన్: మండలంలోని క్రైస్తవ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భీమవరం మండలంలోని తుందుర్రు, దిరుసుమర్రు, పెద గరువు, గొల్లవానితిప్ప, అనాకోడేరు, తాడేరు, బేతపూడి, వెంప తదితర గ్రామాలలో ఆదివారం ఈస్టర్ పండుగ సందర్భంగా వేకువ జామునే క్రైస్తవ విశ్వాసులు, పాస్టర్లు, సమాధుల వద్దకు చేరుకుని పూలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలువురు పాస్టర్లు మాట్లాడుతూ ఏసు క్రీస్తు బోధనలు సమాజానికి అనుసరణీయమన్నారు. ప్రతి ఒక్కరూ దైవ ఆరాధనతో ప్రార్థనలు చేస్తే ప్రతి సమస్యకు పరిష్కారం ఆ ప్రభువు చూపిస్తారన్నారు. అనంతరం సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘస్తులు, సంఘపెద్దలు, విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.



భీమవరం అర్బన్: గూట్లపాడులో సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

అభివృద్ధి, సంక్షేమానికి అండగా నిలబడాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



కిరాణా మర్చంట్స్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం: భీమవరం నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి అండగా నిలబడాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కిరాణా మర్చంట్స్ వర్తకులను కోరారు. స్థానిక కిరాణా మర్చంట్స్ భవనంలో ఆదివారం జరిగిన కిరాణా మర్చంట్స్ వర్తకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భీమవరం నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న తనకు రానున్న ఎన్నికల్లో ప్రజలు అండగా ఉండాలని, నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేసుకోవడానికి తనతో నడవాలని ఆయన కోరారు. ఈ ఐదేళ్ల కాలంలో భీమవరం పట్టణ రూపురేఖలను మార్చడం జరిగిందని, ముఖ్యంగా జిల్లాల పునర్విభజనలో భాగంగా నూతనంగా పశ్చిమగోదావరి జిల్లా ఏర్పడడంతో జిల్లా కేంద్రాన్ని ఇతర నియోజకవర్గాలకు తీసుకెళ్లడానికి చాలామంది ప్రయత్నం చేశారని అన్నారు. అయితే మంత్రి పదవి కావాలా, జిల్లా కేంద్రం కావాలా అని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అడిగినప్పుడు తాను మంత్రి పదవి వద్దని, జిల్లా కేంద్రం కావాలని కోరడం జరిగిందన్నారు. భీమవరం జిల్లా కేంద్రం కావడం వల్ల వ్యాపార ,వాణిజ్య సముదాయాలు కార్పొరేట్ దిశగా ఎదుగుతాయని అన్నారు. ఇప్పటికే పట్టణంలో కొన్ని కార్పొరేట్ సంస్థలు తమ వ్యాపారాలను ప్రారంభించాయని అన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని కార్పొరేట్ సంస్థలు భీమవరం పట్టణం రానున్నాయని వెల్లడించారు. దీనికి భీమవరం పట్టణంలో వ్యాపార వాణిజ్య వర్గాలకు అన్ని వసతులను కల్పించడమే కారణమన్నారు. మరో ప్రక్క పట్టణంలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ సమస్యలు లేకుండా అండర్ టన్నెల్స్ ను కేంద్ర రైల్వే శాఖ సహకారంతో నిర్మించడం జరిగింది అన్నారు. మరోపక్క పట్టణంలో ప్రతి వార్డులో కూడా సీసీ రోడ్లు, డ్రైయినేజీ వ్యవస్థలను మెరుగుపరిచామని, ముఖ్యంగా 2024 సంవత్సరాన్ని దృష్టిలో పెట్టుకుని పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రతిరోజు కోటి లీటర్ల మంచినీళ్లు సరఫరా జరుగుతుండగా, ఇటీవలే దాని సామర్థ్యాన్ని సుమారు మూడు కోట్ల లీటర్ల వరకు పెంచడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పట్టణంలో 24 గంటల పాటు తాగునీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. భీమవరం నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారని, తాను మరోసారి ఎమ్మెల్యే అయితే భీమవరం నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం ఉంటుందని, కాబట్టి వ్యాపార వాణిజ్య వర్గాలు ఈ ఎన్నికల్లో వైసీపీకి అండగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల, పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సభాపతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు

ఉండి: జాతీయ రహదారిపై మార్చి 30న ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం కృషి విజ్ఞాన కేంద్రం ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆకివీడు మండలం పెదకాపవరం గ్రామానికి చెందిన మరపట్ల జ్ఞానప్రకాష్ అనే వ్యక్తి భీమవరంలోని ఓ ప్రైవేటు రొయ్యల కంపెనీలో ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నాడు. యథావిధిగా తన ద్విచక్రవాహనంపై డ్యూటీకి వెళ్లి 30న మధ్యాహ్నం ఇంటికి బయలుదేరాడు. సరిగ్గా ఐటీఐ వద్దకు రాగానే ఏపీ 16 టీఎఫ్ 8829 అనే నంబరు ఉన్న లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో ఢీకొట్టడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. 108 సహాయంతో బాధితుడిని భీమవరం తరలించారు. ప్రమాదంలో బాధితుడికి తలకు బలమైన గాయం కావడంతో పాటుగా ముక్కు, కుడి దవడ విరిగినట్లు వైద్యులు నిర్ధారించారు.ప్ర మాదంపై ఆసుపత్రి నుండి అందిన సమాచారం మేరకు, అలాగే బాధితుడి అన్న మునియ్య ఫిర్యాదు ఆధారంగా ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు.

మన భవిష్యత్ కోసం మళ్లీ జగన్‌ను ఎన్నుకోవాలి



25వ వార్డు వీవర్స్ కాలనీలోఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు

నరసాపురం: మన అభివృద్ధి, సంక్షేమం, పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని నరసాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రజలను కోరారు. ఆదివారం ముదునూరి పట్టణంలోని 25వ వార్డు వీవర్స్ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగిన ముదునూరి ఐదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రతీ కుటుంబానికి నవరత్నాల పథకంలో భాగంగా కలిగిన లబ్ధిని తెలియజేశారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాలు సుఖ సంతోషాలతో ఉన్నాయన్నారు. కుటుంబంలో మంచి జరిగితేనే ఓటు వేయమని తమ నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెబుతున్నారని అన్నారు. నరసాపురం నియోజకవర్గంలో రాష్ట్రంలోనే ఎక్కువ మొత్తంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయని ముదునూరి వివరించారు. రూ.430 కోట్లతో ఆక్వా యూనిర్సిటీ ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. వశిష్ట వంతెన టెండర్ దశలో ఉందన్నారు. బియ్యపుతిప్ప ఫిషింగ్‌హార్బర్ పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. రూ.5 కోట్లతో బస్టాండ్ అభివృద్ధి, రూ 13 కోట్లతో 100 పడకల ఏరియా ఆసుపత్రి నిర్మిచామన్నారు. కాశీపట్నం జమిందారీ భూములు, దర్భరేవు కంపెనీ భూముల సమస్య పరిష్కరించి రైతులకు మేలు చేశామన్నారు. పేరుపాలెం బీచ్‌ను టూరిస్ట్ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. జగన్ ముఖ్యమంత్రి కాకూడదని, పేదలకు మంచి జరగకూడదనే లక్ష్యంతో టీడీపీ, జనసేన, బీజేపీలు జతకట్టి వస్తున్నాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం శ్రమించిన తనకు ఎమ్మెల్యేగా మళ్లీ అవకాశం ఇవ్వాలని కోరారు. ఎంపీ, ఎమ్మెల్యే రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ మావూరి సత్యనారాయణ, స్థానిక కౌన్సిలర్ యర్రా ఉమాశ్రీనివాస్, అర్బన్ బ్యాంకు చైర్మన్ ద్వారా హేమకుమార్, జిల్లెళ్ల దిలీప్, సిర్రా కాంతమ్మ, కావలి నాని, ద్వారా ప్రసాద్, కేసరి గంగరాజు, గోరు సత్తిబాబు, నాయకులు పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు భూసరపు జయ, కడలి పెద్దిరాజు, వార్డు నాయకులు వంగలపూడి జక్కరయ్య, కోటిపల్లి దొరయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రామానాయుడు వ్యాఖ్యలు అర్థరహితం

పాలకొల్లు అర్బన్: ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు చింతపర్రు దళితవాడలో తనను వలస పక్షి అనడం అర్థరహితమని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే రామానాయుడు పీహెచ్‌డీ చేశారో లేక పీయూసీ చదివారో అర్థం కావడం లేదన్నారు. నారా లోకేష్, బాలకృష్ణ, పవన్‌కల్యాణ్‌లు వలస పక్షులు కారా? అని గుడాల గోపి నిలదీశారు. ఎమ్మెల్యే నిమ్మల ప్రజా వైద్యుడుగా, మంచి వ్యక్తిగా గుర్తింపు పొందిన డాక్టర్ బాబ్జిని వెన్నుపోటు పొడిచి అసెంబ్లీ టికెట్ సాధించుకున్న విషయం నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసన్నారు. అలాగే టిడ్కో గృహాలతో పాటు, 20 శాతం కమీషన్లు దండుకుని మంత్రి పదవి కోసం నారా లోకేష్‌కి డబ్బు సూట్‌కేసు అందించిన విషయం కూడా ప్రజలకు తెలుసన్నారు. ఆ డబ్బు లోకేష్ తిరిగి ఇవ్వని కారణంగా 18 రోజులు ఆసుపత్రిలో ఉన్న విషయం ఎమ్మెల్యే నిమ్మల మర్చిపోయారా? అని ప్రశ్నించారు. స్థానిక సంస్థలకు చెందిన టీడీపీ ప్రజాప్రతినిధులపైనా, ఓ దళిత యువకుడిపైనా చేయి చేసుకున్న విషయం నిజం కాదా? అని ప్రశ్నించారు. అవినీతి చేసి సంపాదించిన డబ్బుతో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రామానాయుడు అవినీతిని బహిరంగంగా నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ చేసినా ముందుకు రాలేదని మండిపడ్డారు.

గాయపర్చిన ఘటనపై కేసు

ఉండి: మండలంలోని కలిసిపూడి గ్రామంలో పాతకక్షల నేపథ్యంలో జరిగిన దాడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం 5:30 గంటల సమయంలో పాతకక్షలను మనసులో పెట్టుకుని కలిసిపూడి గ్రామానికి చెందిన రామకూరి సామ్యూల్ అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన బాతు బెస్లీ అనే వ్యక్తి అతని కుటుంబ సభ్యులు దాడి చేయడంతో అతడు గాయపడ్డాడు. దీంతో చికిత్స కోసం భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చేరారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు.

ప్రచార సామగ్రి స్వాధీనం



భీమవరం ఆర్టీసీ కార్గో సర్వీస్ సెంటర్‌లో బీజేపీ ప్రచార సామగ్రిని పరిశీలిస్తున్న సీఐ

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం బస్టాండ్ కార్గో సర్వీసు సెంటర్‌లో ఆదివారం రాత్రి ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆదివారం భారతీయ జనతా పార్టీకి సంబంధించి ప్రచార సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై విచారణ చేపడుతున్నామని సీఐ అడబాల శ్రీనివాస్ తెలిపారు.

సంక్షేమ పాలన సీఎం జగన్‌కే సాధ్యం



మహిళను ఓటు అభ్యర్థిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం సీఎం జగన్‌కే సాధ్యమని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) చెప్పారు. పట్టణంలోని 8వ వార్డులో ఆదివారం గుడాల గోపి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడాల గోపి విలేకరులతో మాట్లాడుతూ గడప గడపనా సీఎం జగన్ అందించిన సంక్షేమ ఫలాలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. రాబోయే కాలంలో సీఎం జగన్ మరిన్ని సంక్షేమ పథకాలు అందించే విధంగా మేనిఫెస్టో రూపొందిస్తున్నారని ఓటర్లకు చెప్పారు. ప్రజల కోసం సీఎం జగన్ 130 సార్లు బటన్ నొక్కారని, ఆయన కోసం రెండు సార్లు బటన్ నొక్కి ఫ్యాన్ గుర్తుకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయన వెంట పార్టీ పట్టణ అధ్యక్షుడు చందక సత్తిబాబు, యడ్ల తాతాజీ, అడబాల వెంకటరమణ, ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, వార్డు ఇన్‌చార్జ్ దొమ్మేటి వెంకట్రావు, శంకరావు శ్రీనివాసు, జోగాడ ఉమామహేశ్వరరావు, యంధం ధనలక్ష్మి, యంధం శ్రీనివాస్, రౌతు అచ్యుతరావు, గంగిరెడ్ల హైమావతి, బాబ్జి, బాలి మోహనరావు పాల్గొన్నారు.

నేడు శ్రీ నేరేళ్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ

పాలకొల్లు అర్బన్: మండలంలోని వరిధనంలో నిర్మించిన శ్రీ నేరేళమ్మ వారి నూతన ఆలయ విగ్రహ, యంత్ర, శిఖర పునః ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ కొత్తలంక వీర వెంకట సత్యనారాయణ శర్మ బ్రహ్మత్వంలో గ్రామ పెద్దలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం 9.23 ని.లకు శిఖర ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.